# లాటరీ!

లాటరీల్లోకెల్లా సిక్కిం లాటరీయే నెంబర్‌వన్ ! మిగతా రాష్ట్రాలన్నీ దానిముందు బలాదూరేనంటాడు అంకుల్ !

అంకుల్‌కి లాటరీ పిచ్చి జాస్తి ! అప్పుడప్పుడు ఐదొందలో... వందో... యాభైయ్యో ప్రైజ్‌మనీ లాటరీలో తగులుతూండటం మూలాన నెలకు లాటరా టిక్కెట్లు కొనటం కోసం మినిమం వెయ్యి రూపాయలలు పక్కన పడతాడు.

'మీకిదేం లాటరీ పిచ్చండీ ?... ఇలా దుబారా చేసే డబ్బును' సేవ్ చేసుకుంటూంటే ఆడపిల్ల పెళ్లి చెయ్యచ్చు... ఎప్పుడో ఒకసారి పొరపాటున అయిదొంలు తగిలిందని అన్నిసార్లూ మనకే వస్తుందా?-' ఆంటీ కామెంటు.

'వస్తుందే ! తప్పక వస్తుంది ! చచ్చినట్టు వస్తుంది. మూల్గంగ మూల్గంగ రోగం... తీయంగ తీయంగ రాగం... కొనంగ కొనంగ లాటరీ అన్నారు పెద్దలు ! నాకేదో రోజున కోటి రూపాయల లాటరీ తగుల్తుంది. తప్పదు ! అప్పుడు నన్నెవరూ ఆపలేరు...' కాలరెగరుశాడు అంకుల్.

'కలలు కంటూ వుండండి ! జేబులో డబ్బు మాత్రం తిరుక్షవరమౌతూంటుంది...'

నువ్వలా శాపనార్థాలు పెట్టకు ! తథాస్తు దేవతలుంటారు. వచ్చేది కూడా రాకుండాపోతుంది. చివరకు నీ దిష్టే తగిలేను...'

'ఇదిగో... మీరు రాసే కథలు... కొంటున్న లాటరీ టిక్కెట్లు శుద్ధ వేస్ట్ !. కథలు రాయటమేగానీ ఏ పత్రిక వాళ్లూ అచ్చేసిన పాపానపోలేదు. అలాగే లాటరీ కూడా ! నెలకు వెయ్యి రూపాయలు తగలేయటమే తప్ప.. దానివల్ల లాభం ఆవగింజ అంతైనా వుందా?- ఎవరిపిచ్చి వారికానందం!... రండి... భోజనం వడ్డిస్తాను. ఆదా చెయ్యటం చేతకాకున్నా వేళకు తిండి ఖర్చు తప్పదు కదా?-' కిచన్లోకి దారితీసింది ఆంటీ రుసరుసలాడుతూ.

పై రెండు విషయాల్లో ఆంటీ అంకుల్‌కి రోజూ తగవు తప్పదు.

'చూడు సుమతీ ! ఊరికే సుమతీ శతకంలో పద్యాలు వల్లించి నన్ను ఎగతాళిచేయకు ! - నాకు శుక్రమహర్దశ జాతకరీత్యా ఇటీవలే మొదలైంది. ఇహ...

పట్టిందంతా బంగారమే ! నన్నెవరూ ఆపలేరు. లాటరీలో 'కోటి' బంపర్ బహుమతి కొట్టకా తప్పదు... ఏనాటికైనా పత్రికలు నిర్వహిచంఏ కథల పోటీల్లో ఫస్ట్‌ప్రైజ్ కొట్టకా మానను. అప్పుడు తెలుస్తుంది నా గొప్పేమిటో? కూర్చున్న వాడల్లా లేచి అంకుల్ కూడా డైనింగ్ టేబుల్ కేసి నడిచాడు!.

కొందరికి ప్రేమపిచ్చి ! మరికొందరికి బడ్బు పిచ్చి ! ఒక్కొక్కరికి ఒక్కో పిచ్చి !. అంకుల్‌కు కథలు రాసే పిచ్చి !. అచ్చైనా కాకున్నా వారానికో కథ ఏదో పత్రికకు పోస్ట్ చేస్తునే వుంటాడు. రెండవ ది లాటరీ పిచ్చి ! ఈ రెండు 'పిచ్చి' లకు మందు లేదు. ట్రీట్‌మెంటూ లేదు. ఇదొక రకమైన వ్యసనం.! దురద... అంతే!

ఇవి తీరే కోరికలు కావనేది సుమతి ఆంటీ వాదన !

'లాటరీలో కోటి వస్తే వుద్యోగం మానేస్తారా ?'

'పిచ్చి సుమతీ కోటీశ్వరుడినయ్యాక ఇంకా బోడి వుద్యోగందేనికే ! వెనక్కాళ్లతో గాడిద తన్నినట్టు లాటరీ తగిల డబ్బు చేతికి అందగానే వుద్యోగాన్ని తన్నేస్తానంతే ! సొంతంగ టి.వి. సీరియల్స్ తీస్తా ! నాకున్న టాలెంటేమిటో ప్రజలకు చూపిస్తానే...' పెరుగన్నం జుర్రుతూ గర్వంగ అన్నాడు అంకుల్ సుబ్రావ్ 'బ్రేవ్' గ.

X X X

మొత్తానికి అంకుల్ సుబ్రావ్‌కు సిక్కిం లాటరీలో కోటిరూపాయల ఫస్ట్ ప్రైజ్ తగలనే తగిలింది. ఇంటిల్లిపాదీ ఎగిరి గంతేశారు. చేస్తున్న వుద్యోగం మానేసి మాట నిలబెట్టుకున్నాడు!. మంచి ప్రెస్ కొన్నాడు. మాసపత్రిక ప్రారంభిచాలనే ఆలోచనకు శ్రీకారం చుట్టాడు.

ప్రారంభ సంచిక మరో నాలుగు నెల్లకు మార్కెట్లో విడుదల అవుతుందనగా... కథల పోటీ రిర్వహిస్తున్నట్టు అన్ని పత్రికలలో ప్రకటనలొచ్చినయ్ !. టీ.వీ. ల్లో యాడ్స్ సైతం ప్రత్యక్షమైనయ్.

తన సొంతింటిని పత్రికాఫీసుగా మార్చేశాడు ! కొరియర్ సర్వీసు ద్వారా వచ్చిపడుతున్నయ్ ! వచ్చే కథల సంఖ్య చూచి మతిపోతోంది సుబ్రావ్‌కి.

కాలపరిమితి ముగిసేసరికి లక్షా తొంబై తొమ్మిదివేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది వచ్చినయ్ ! బాటా రేట్ లాగ ఇన్ని కథలా? ఇవి కథల కడలా? ఇవన్నీ

చదవాలంటేనే రెంపేళ్లు పడుతుంది. అదీ పదిమంది మనుష్యుల చేత చదివిస్తే !.

పత్రకంటే ఏదో నెలకు పది కథలొస్తాయని... పోటీ పెడితే ఓ రెండు మూడొందలు రావచ్చనేది సుబ్రావ్ అంచనా.

ఇన్ని కథలు రావటానికి కారణం... ఫస్ట్ ప్రైజ్ లక్ష... రెండవ బహుమతి యాభైవేలు... మూడు థర్డ్ ప్రైజ్ బహుమతులు ఒక్కోదానికి పాతికవేలు. సాధారణ ప్రచురణ ఎన్నికైన ప్రతి కథకూ పదివేలు!

ప్రైజ్‌మనీ ఇంతేసివుంటే... రైటర్ టెమ్ప్టై రాయక చస్తారా? అందుకే ఇంత వీర రెస్పాన్స్!

సుబ్రావ్‌కి ఓ బ్రహ్మాండమైన ఆలోచనొచ్చింది ! కథలన్నీ చదవకుండా... కథపేరు రచయిత పేరు చీట్లమీద రాసి సిమెంట్ మిక్సింగ్ రోలర్ తెప్పించి లాటరీ పద్ధతి ద్వారా బహుమతులు ఇవ్వాలని డిసైడైనాడు.

ఆ విధంగ లాటరీ వేయగ వచ్చిన కథల పోటీ వివరాలను ప్రారంభ సంచికలో ప్రకటించాడు.

ఈ ఇన్ఫర్మేషన్ 'లీకై' రచయితలంతా ఏకమై కథలకు లాటరీ పద్ధతిలో బహుమతులీయరాదని ఆఫీసుముందు 'ధర్నా' చేశారు ! పత్రిక - సంపాదకుడు 'డౌన్ డౌన్ ' అంటూ నినాదాలిచ్చారు. సుబ్రావ్‌కి చావు తప్పి కన్ను లొట్టబోయినట్టయింది.

--- సమాప్తం ---